

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక
(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 12 మే, 2016 సంచిక : 12

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**ప్రధాన సంపాదకత్వం**
**శ్రీ మాతా శుకవాణి**
భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | |
|---|---|
| ద్వైవార్షిక చందా.......... | రూ|| 160/- |
| ఆజీవ సభ్యత్వం .......... | రూ|| 800/- |

**చిరునామా :-**
**సాయివాణి**
C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
నల్గొండ జిల్లా - 508 126.
**Ph : 9440413455, 9848133565**
E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2
మూలశక్తి .......... 6
జగద్గురు తత్త్వబోధకస్వామి .......... 9
సచ్ఛిశిష్యుడు .......... 12
బాలవాణి-అర్థనా .......... 13
ఆత్మబలం .......... 14
చిత్రమేముంది? .......... 16
శిలారోదనం .......... 17
శ్రీ గజానన విజయం .......... 19
షిరిడీ డైరీ .......... 21
స్వరాంజలి .......... 22
గురువాణి-4 .......... 23
గురువుగారితో కబుర్లు .......... 25
మాతృసంస్థ కబుర్లు .......... 27







## మా వాణి

### పాతికేళ్ల ఉగాది

ప్రియ మిత్రులారా,

సాయిధామం సేవాశ్రమం పాతికేళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్నది - దుర్ముఖి ఉగాదినాటికి. నాటి నుండీ నేటి వరకు ఎన్నెన్నో మజిలీలు - ఎగుడు దిగుళ్లు - ఉత్సాహ నిర్వేదాలు - విజయాలు అపజయాలు ... సాయిధామం ఆదిలో పరమపూజ్య గురుదేవులు ప్రసాదించిన వెలుగులోనే నడుస్తూ వెడుతున్నది. ఒక నిత్యస్మృతిగా పాతికేళ్లనాటి 'మా వాణి' మళ్లీ అందిస్తున్నాం.

- ప్రధాన సంపాదకురాలు)

ఒక జంతువు - ఉదాహరణకి కుక్క పిల్లనుకుందాం - పుట్టింది, పెరిగింది. అరవటం, తినటం, తిరగటం, వయసు రాగానే ఆడతోడో, మగ తోడో వెదుక్కోవటం, పిల్లల్ని కనటం, అన్నీ సహజంగా జరిగిపోతాయి. వార్ధక్యం వచ్చింది. ఏవో రోగాలు తగులుకున్నాయి-వాటితో తీసుకు తీసుకు చచ్చిపోయింది.

ఇక - ఒక మానవశిశువు పుట్టాడు-పెరిగాడు-తినటం, తిరగటం, మాట్లాడటం, తెలివితేటలున్నందు వలన చదవటం, వ్రాయటం, ఉద్యోగం సంపాదించటం, వయసురాగానే వివాహం, ఆపైన సంతతిని పొందటం, వారిని పెంచటం, అన్నీ అత్యంత సహజంగా జరిగిపోయాయి. వార్ధక్యం రాగానే వ్యాధులు, బాధలు, మరణం - అతని చరిత్ర ముగిసిపోయింది.

మరి-ఆపైన చెప్పకున్న కుక్కకీ, ఈ మనిషికీ తేడా ఏం కన్పిస్తోంది? పైగా ఆ కుక్క చేయని ఒక వెర్రిపని కూడా మనిషి చేస్తాడు. రేపటి

కోసం దాయడానికీ, తన సంతతికి అందించడానికి బోలెడంత డబ్బు కూడబెట్టాలని తపనపడ్డాడు. ఆ పని కోసం ఎన్నో తప్పడు పనులు కూడా చేసాడు. ఇంక అతడు మనిషిగా పుట్టి ప్రయోజనం ఏముంది? ఎన్నో లక్షల జన్మల తర్వాత దొరికిన అమూల్య అవకాశం, వరం మానవజన్మ. ఏ ప్రాణికీ లేనంత గొప్ప యోచనాశక్తి, బుద్ధిబలం మానవుడికి ప్రసాదించాడు పరమాత్ముడు. ఈ జన్మను సవ్యంగా నడుపుకోకపోతే, ఆయనను చేరుకొనే ప్రయత్నం చేయకపోతే మనం మానవులుగా పుట్టి కూడా జంతుప్రాయులమై యీ సదవకాశాన్ని వ్యర్థం చేసుకున్నట్లే గదా! మరెలా సద్వినియోగం చేసుకోవటం? సాయీసాధకులైన వారందరికీ ఆ స్వామి బోధలే శిరోధార్యం. సాటి ప్రాణులన్నింటిపైనా ప్రేమవర్షం కురిపించటం, అనాధలనూ, అభాగ్యులనూ అక్కున చేర్చుకొని ఆదరించటం-యిదే ఆయనను చేరగల ఏకైక మార్గం. నేడున్న పరిస్థితులలో మన దేశానికి యోగ్యమైన కర్మమార్గం యిదే. ఆ ఉద్దేశ్యంతోనే ముందుకు సాగుతున్నాం.

అయితే యిది అత్యంత క్లిష్టమైన మార్గం. "దుర్జనుల చేష్టలన్నీ సజ్జనుల కాళ్లకు సంకెళ్లవుతాయి" అంటుండేవారు పూజ్యపాదులు, కీర్తిశేషులు శ్రీ చోడవరపు సాంబమూర్తిగారు. 'సేవ' అనే పేరుతో లక్షల లక్షలు పోగు చేసి దిగమ్రింగటం ఒక వృత్తిగా పెట్టుకున్నారు కొందరు నీచులు. వారితో చేదు అనుభవాలు పొందినవారు, నష్టపోయినవారు-సదుద్దేశ్యంతో ముందుకు సాగేవారిని కూడా సందేహిస్తారు. అది సహజం కూడా. ఇదొక రకం యిబ్బంది. ఇంకొందరికి వివేచనా, సహృదయతా ఉండవు. వీళ్లకి ఎప్పుడూ మెదులుతూనే ఉంటుంది. ఎక్కడో దూరంగా ఎవరో ఏదో కుశంక చేసారంటే "శెభాష్" అనే యీ బుద్ధిమంతులే-తమ చుట్టూ ఉన్న వారిలో ఎవరైనా ఏదైనా తలపెడితే రంధ్రాన్వేషణకు పూనుకుంటారు. వీళ్ళు నక్కలూ, పీతలూ వంటి జంతువుల్లాగా కన్నాలు వెతుకుతూనే బ్రతుకుతారు. ఒక వీరుడే మరొక వీరుడిని మెచ్చుకోగలడు. ఒక ఆర్ధచిత్తుడైనవాడే మరో ఉత్తముడిని అర్థం చేసుకోగలడు. పోనీ వీళ్లు





మౌనంగా ఊరుకున్నా నయమే. అహం అలా ఊరుకోదు. తేలు-సన్యాసి కథలో సన్యాసి సాయం చేయబోతున్నప్పడల్లా తేలు కుడుతూనే ఉన్నట్లుగా-వీళ్లు కుడుతూనే ఉంటారు. ఇక-ఆ సేవాభావంతో కృషి చేస్తున్నవారు స్త్రీలైతే మరికొన్ని సమస్య లెక్కువ ఉంటాయి. ఒక మహత్కార్యం తలపెట్టిన పదిమంది వ్యక్తులు కలిస్తే వారి శక్తి, మనోభావం దృఢమవుతాయి. అప్పడు వారికి తమ ధ్యేయంపైనే దృష్టి నిలిచి ఉంటుంది తప్ప-స్వార్థ పుటాలోచనలుగానీ, స్త్రీ, పురుష భేదాలుగానీ, అల్పపుటాలోచనలుగానీ ఉండవు. ఉంటే వాళ్లు సాయి సేవకులే కాలేరు. ఐతే మన దోషైకదృక్కులైన వీరులకి మాత్రం ఎంతకీ అవే గోచరిస్తాయి. ఫలితంగా ఆయా సేవకులపై రకరకాలుగా బురదచల్లే ప్రయత్నం చేస్తారు అందులోనే ఒక క్రూరానందాన్ని వారు పొందుతారు.

ఆంధ్రదేశంలో సమాజ సంస్కారం కోసం, స్త్రీ జనోద్ధరణ కోసం తన సర్వస్వం ధారపోసిన మహనీయులు శ్రీ కందుకూరి వీరేశలింగంగారు ఆయన తన సమకాలికులు తనపై విసిరిన రాళ్లను గురించీ, నిందలను గురించీ తన ఆత్మకథలో వివరించారు. ఇలాటి వ్యర్థులను గూర్చి పట్టించుకోవద్దనీ, పళ్లున్న చెట్టుకే రాతిదెబ్బలన్నట్లు సేవ చేసే వాళ్లకీ బాధలు తప్పవనీ సంఘసేవకులకు హితవు చెప్పారు. సమకాలికులైన వారిలోని మహత్వాన్ని మనం దర్శించలేం. అతితేజోవంతులైన ఆయా వ్యక్తులకు దగ్గరగా ఉండటంచేత మనకు కళ్లు మిరుమిట్లుగొల్పుతాయి. వాళ్లు పోయాక-వాళ్లకు మనం దూరమయ్యాకగానీ ఆ కాంతిని మనం గుర్తించలేము అంటారు శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు-యిలాటి సందర్భాన్నొకదాన్ని వివరిస్తూ -

ఇవ్వాళ ప్రపంచం అంతా నీరాజనాలర్పిస్తున్న మదర్‌థెరిసా, దుర్గాభాయ్ దేశ్‌ముఖ్‌లాంటి వారికే తొలినాళ్లలో యీ పాట్లు తప్పలేదు. చివరికి స్వామీ వివేకానందుడంతటివాడు కూడా యీ వ్యర్థజల్పకుల పాలపడక తప్పలేదు. అందుచేతనే సమాజస్పృహతో, స్పందనతో సాగుతున్న

వారెవ్వరూ కూడా యిలాటి విఘ్నాలకు, నిందలకు, అవహేళనలకు జడవనూ కూడదు. వెనకడుగు వెయ్యనూ కూడదు.

ఇది వేసవికాలం. అవధూత శ్రీ దత్తాత్రేయులవారు చరాచరాలెన్నింటి నుంచో ఎన్నో విషయాలు నేర్చుకొని, వారంతా తనకు గురువులేనన్నారు. అలాగే యీ "వేసవికాలం" మనకో పాఠం నేర్పుతుంది.

తనకున్న ఆకులన్నీ త్యాగం చేసిన మ్రోళ్లకే
దోసెడు మల్లెలు విరుస్తాయి.
చేదు చివుళ్లు మెసవిన నోళ్లకే తీపిరాగాలు అబ్బుతాయి.
ఎండకుమాడి తడిసిన ఒంటికే మొలకగాలి హాయి తెలుస్తుంది.

అదే మనకు వేసవి యిచ్చే సందేశం. అందులోంచీ మనం ఒక గొప్ప ధీరత్వం నేర్చుకుందాం. తనవారనుకున్న వారికి తీవ్ర పరీక్షలు పెట్టటం సాయికి అలవాటు. ఇలా ఏవైనా వస్తే ఆ యిక్కట్లన్నీ ఆయన పెట్టే పరీక్షలే. ఈ అల్పవాక్కులనీ, నిందలనీ భరిస్తూ, సహిస్తూ కూడా నిశ్చలంగా, మేరు సమధీరంగా ముందుకే నడుద్దాం. మనకు రక్షాకవచం ఆ స్వామి చల్లని తల్లి తాబేటిచూపే. ఆ కవచానికి తగిలి ఆ విద్వేష విశిఖాలన్నీ వచ్చినట్లే వెనుదిరిగిపోతాయి. మనం ఎదురు పలకకుండా ఆ అవమానాలను సహిస్తూ ముందుకు సాగుతుందాం. అప్పుడు మనం అందుకోకపోతే వ్రాసిన వారికే తిప్పి పంపబడే ఉత్తరాల్లాగా-అవన్నీ పంపినవారికే చెందుతాయి.

అచంచల విశ్వాసం, మొక్కవోని ఆత్మధృతి, చేపట్టిన పని పట్ల అనంత మైన గౌరవం, నిరంతరకృషి-యివి ఉంటే సాధించలేనిదేదీ లేదు. "ఈ పని నీవు చేయి" అని నిర్దేశించిన సాయినాథుడే ఆ పని నిర్వర్తించగల శక్తి యిస్తాడు. దానినెవరూ ఆపలేరు. అందుకే ముందుకే సాగుదాం. పరమపూజ్య గురుదేవులు అన్నట్లు మనమేం చెయ్యగలం కాదు. మనమే చెయ్యగలం. పై వాక్యంలోని ఆ ఒక్క శూన్యాన్ని(సున్నాని, ఖాళీని) ఆత్మస్థైర్యంతో, బాబా బోధతో నింపుకుంటే సరి-అంతా మనమే చెయ్యగలం.





ఓం

# మూలశక్తి

**- ఉపనిషత్కథ**

ఒకానొక సమయంలో దేవతలకు, రాక్షసులకు భీషణమైన సమరం జరిగింది. దానిలో దేవతలు గెలిచారు. ఆ గెలుపుతో వారి గర్వానికి మేరలేక పోయింది. సర్వవ్యాపకమైన పరబ్రహ్మమే తమ విజయానికి కారణమన్న విషయాన్ని మరచిపోయి, వారు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించసాగారు. అహంకారంతో విర్రవీగుతూ తమ గొప్పతనం వల్లనే ఆ విజయం లభించిం దని భావించారు. రాక్షసులను చీల్చిచెండాడిన తమ పరాక్రమానికి ఇక ఎదురులేదనీ, తమకు తెలియని విద్య అంటూ ఏదీ లేదు కనుకనే తమ విజయం సాధించామనీ అనుకున్నారు. వారి అధిపతి దేవేంద్రుడు మాత్రం, తన పరాక్రమానికి పరిమితులున్నాయని మరచిపోలేదు. అందువలన మిగిలిన వారు ఎలా ఉన్నా, తాను మాత్రం అణకువగానే ప్రవర్తించసాగారు.

పరబ్రహ్మం వారి గర్వాన్ని గమనించింది. వారి గర్వాన్ని పోగొట్టి వారిని సరైన మార్గంలో పెట్టడం కోసం, వారి ఎదుట ఒక విలక్షణమైన, అంతు చిక్కని రూపంలో ప్రత్యక్షమయింది. తమకు అన్నీ తెలుసని విర్రవీగుతున్న దేవతలకు ఆ రూపం ఏమిటో అర్థం కాలేదు. వారికి భయం, ఆశ్చర్యం-రెండూ ఒకేసారి కలిగాయి. "ఇదేమిటి? మనకు తెలియని రూపం ఏదో ఎదుట నిలిచిందే?" అని వారు ఆశ్చర్యపోయారు. "ఈ రూపం యొక్క పుట్టుపూర్వోత్తరాలు ఏమయివుండవచ్చు?" అన్న ప్రశ్న వారిని వేధించ సాగింది. చాలా తర్జనభర్జనలు చేసి, చివరికి వారు అగ్నిదేవుణ్ణి ఆ రూపం ఏమిటో తెలుసుకొమ్మని పంపారు.

అగ్నిదేవుడు అందుకు ఒప్పకుని, ఆ రూపం దగ్గరకు వచ్చాడు. ఒక భూతంలా ఉన్న ఆ రూపం "ఎవరు నువ్వు?" అని ప్రశాంత, గంభీర స్వరంతో ప్రశ్నించింది.

"నేను అగ్నిదేవుణ్ణి! నా వల్లనే సర్వప్రాణికోటికీ ఆహారం లభిస్తోంది" అని అగ్ని సమాధానం చెప్పాడు.

"అలా అయితే నీవు ఏమి చేయగలవో, నీ శక్తిసామర్థ్యాలు ఏపాటివో నాకు వివరించు!" అని రూపం ప్రశ్నించింది.

"భూతలం మీది ప్రతి వస్తువునూ భస్మీపటలం చేయగల శక్తి నాకుంది!" అని అగ్నిదేవుడు దర్పంతో పలికాడు.

అప్పుడు ఆ రూపం ఒక గడ్డిపరకను అగ్ని ముందు ఉంచి, 'దీన్ని దగ్ధం చేయగలవేమో ప్రయత్నించు!' అని సవాలు చేసింది.

అగ్నిదేవుడు తన శాయశక్తులా ప్రయత్నించినా ఆ గడ్డిపరకను కాల్చలేక పోయాడు. చివరకు ఓటమిని ఒప్పకుని, ఆ రూపం ఏమిటో అర్థం కాలేదని మిగిలిన దేవతల వద్దకు వెళ్లి చెప్పాడు.

ఊహించని పరిణామానికి దిగ్భ్రమ చెందిన దేవతలు, వాయుదేవుణ్ణి సమీపించి ఆ రూపం వివరాలు తెలుసుకోమని అర్థించారు. అగ్ని చేయలేని పనిని తాను చేయగలుగుతున్నందుకు పొంగిపోతూ, అతడు ఉత్సాహంతో ఆ రూపాన్ని సమీపించాడు. ఆ రూపం, "ఎవరు నువ్వు?" అని మళ్లీ ప్రశ్నించింది. "నేను వాయుదేవుణ్ణి. నా వల్లనే సమస్త ప్రాణికోటి ఉంటే మానవులు, జంతువులు, ఇతర జీవులు, చివరకు దేవతలు కూడా జీవించి ఉన్నారు" అని గొప్పలు చెప్పాడు.

"అలా అయితే నీ శక్తిసామర్థ్యాలు ఏమిటో వివరించు!" అని రూపం ప్రశ్నించింది. "భూమి మీద ఉన్న ఏ వస్తువునైనా నేను ఎగరగొట్టగలను. అంతేకాదు, ధ్వంసం చేయగలను" అని వాయుదేవుడు సమాధానం చెప్పాడు.

ఆ రూపం వాయుదేవుడి ముందు కూడా ఒక గడ్డిపరకను ఉంచి, దాన్ని కదల్చమని సవాలు చేసింది. వాయుదేవుడు తన సర్వశక్తులూ ఒడ్డి ప్రయత్నించినా ఆ గడ్డిపరకను కదపలేకపోయాడు. చివరకు అతడు





కూడా తన ఓటమిని ఒప్పకుని ఆ రూపం ఏమిటో బోధపడలేదని మిగిలిన దేవతల వద్దకు వెళ్లి చెప్పాడు.

దేవతల ఆశ్చర్యానికి అంతులేదు. వారు ఆ రూపంలో చాలా పెద్ద రహస్యం దాగి ఉందని గ్రహించారు. అందరూ కలిసి దేవేంద్రుడి వద్దకు వెళ్లి ఆ రూపం ఏమిటో తెలుసుకొమ్మని అర్థించారు.

దేవేంద్రుడు అందుకు సమ్మతించి వారినందరినీ వెంటబెట్టుకుని ఆ రూపం వద్దకు వెళ్లాడు. కానీ విచిత్రంగా ఆ రూపం అదృశ్యం అయిపోయి, అక్కడ ఒక అత్యంత సౌందర్యరాశి అయిన స్త్రీమూర్తి ప్రత్యక్షం అయింది. ఆమె హిమవంతుడి కుమార్తె హైమవతి. ఆమెను పార్వతి లేదా ఉమాదేవి అని కూడా పిలుస్తారు.

"అమ్మా! మమ్మల్నందరినీ కలవరపెట్టిన ఆ రూపం ఏమిటి?" అని దేవేంద్రుడు ఆ తల్లిని అడిగాడు. "అదే పరబ్రహ్మం!" అని ఆమె సమాధానం చెప్పింది.

"దేవేంద్రా! తమ అల్పబుద్ధి వలన నీ అనుచరులైన ఇతర దేవతలు ఆ విలక్షణరూపం యొక్క నిజస్వరూపాన్ని అర్థం చేసుకోలేకపోయారు. అదృశ్యం అయిపోయిన ఆ అపూర్వశక్తి పరబ్రహ్మం తప్ప మరొకటి కాదు. ఆ బ్రహ్మతత్త్వమే మీమీ శరీరాలలో, వ్యక్తిత్వాలలో శక్తినీ, ధైర్యాన్నీ, పరాక్రమాన్నీ నింపి యుద్ధంలో గెలిచేలా చేసింది. కాబట్టి ముల్లోకాలలోని జీవకోటికి, దేవతలకు, రాక్షసులకు, అంతేకాక ప్రాణంలేని గ్రహనక్షత్రాలకు సైతం ఆధారభూతమూ, వాటివాటి జీవితాలకు పరమార్థమూ అయిన పరబ్రహ్మాన్ని గుర్తెరిగి మసలుకోండి. మీ అహంకారాన్ని తగ్గించుకుని, ఆ బ్రహ్మజ్ఞానంతో మీరు సదా వర్ధిల్లుదురుగాక!" అని ఆశీర్వదించింది.

# జగద్గురు తత్త్వబోధక స్వామి

**- రాబర్టో డీ నోబిలీ అనే క్రైస్తవ ఫాదరీ చరిత్ర**

**- శ్రీ దిగవల్లి శివరావుగారి కథలు-గాథలు నుండి**

(గత సంచిక తరువాయి)

నోబిలీ ఒక బ్రాహ్మణ వంటవాడిని పెట్టుకున్నాడు. శూద్రుడి చేతి అన్నం తినడానికి సాహసించేవాడు కాడు. సన్యాసులందరిలాగనే అతడు మధ్యాహ్నం నాలుగు గంటలవేళ ఒంటిపూట భోజనం చేసేవాడు. దినమంతా అతడు దేశభాషలను చదవను వ్రాయను నేర్చుకునేవాడు. అతడు యీ దేశానికి రాగానే కొచ్చినులోనే అరవం నేర్చుకోవడం ఆరంభించాడు. ఆరునెలలలో ఇతరులతో మాట్లాడే శక్తి సంపాదించాడు. రెండేళ్లలో (1609లో) అతడు మళ్లీ తన దేశానికి వ్రాస్తూ అరవంలో మాట్లాడడం కంటె ఇటాలియను పోర్చుగీసు భాషలలో మాట్లాడడమే ఇప్పుడు తనకు కష్టముగా ఉన్నదని వ్రాశాడు. ఈ అరవభాష చాలా గొప్పదనిన్నీ, అందమైనదనిన్నీ కూడా వ్రాశాడు. అతడు తమిళ గ్రంథకర్తల నుంచి పద్యాలు చదువుతూ, కథలు ఉదాహరిస్తూ గ్రాంథికమైన అరవాన్ని చక్కగా మాట్లాడేవాడని 1608లో ఆయన తోడి మతాచార్యుడొకడు వ్రాశాడు.

అరవం బాగా వచ్చిన తరువాత నోబిలీ తెలుగును, సంస్కృతమును నేర్చుకోవడం ప్రారంభించాడు. ఇంతవరకూ తెల్లవారెవ్వరూ తెలుగు బాగా నేర్చుకోలేదు. మధుర వాస్తవ్యుడైన ఒక బ్రాహ్మణపండితుడు నోబిలీకి ఈ భాషలు నేర్పడానికి కుదిరాడు. 1609 ఏప్రిల్ 22వ తేదీన రాష్ట్రీయాధికారికి నోబిలీ వ్రాసిన ఉత్తరంలో తన పంతులవారిని గురించి ఇలాగ వ్రాశాడు : "ఈ సద్బ్రాహ్మణుడు నాకు చేసే ఉపకారానికి తగినట్లు నా కృతజ్ఞతలు తెల్పజాలను. ఆయనవల్ల నేను సంస్కృతము, తెలుగు నేర్చుకోవడమేగాక అంతకన్న అమూల్యమైన విషయాలను ఆయన వల్ల తెలుసుకోగలిగాను. వేదాల రహస్యాలను ఆయన నాకు చెప్పాడు. వేదాలను వ్రాయడం మహాపాతకమని బ్రాహ్మణుల ఊహ. దానిని ఎంతో కష్టపడి పదిపన్నెండేళ్లు పాఠము చెప్పించుకుని కంఠస్థము చేస్తారు. ఈ విషయంలో నా గురువు తన శంకలను మాని ఈ సూత్రాలనన్నింటినీ నాకోసం వ్రాసిపెట్టాడు. అయితే యిది చాలా రహస్యంగా చెయ్యాలి. ఈ సంగతి ఇతర బ్రాహ్మణులకు తెలిస్తే వాళ్లు ఆయన గ్రుడ్లు పీకుతారు. ఇది నేర్చేటందుకు ప్రాణభయానికి కూడా తెగించాలి. ఎందువల్లనంటే హిందువులను క్రైస్తవమతంలో కలపాలంటే ఈ రహస్యాలు తెలియడం చాలా అవసరం". ఈ విద్యను అభ్యసించడంలో నోబిలీ అమితమైన పట్టుదలతో పనిచేశాడు. ఆఖరుకు క్షవరం చేయించుకుంటూ ఉన్నప్పుడు కూడా పాఠాలు చదువుతూనే ఉండేవాడు.

1608లో నోబిలీని గురించి ఒకడు వ్రాసిన దానిలో ఇలా వుంది. "అతడు సంస్కృతం నేర్చుకోవడం మొదలుపెట్టాడు. అప్పడే అతడు ఆ భాషను చదవడమూ, మాట్లాడడమూ కొంతవరకు నేర్చుకొన్నాడు". రెండేళ్ల తరువాత 1610 డిసెంబరు 8వ తేదీన ఆ భాషను నోబిలీ బాగా అర్థం చేసుకోగలుగుతున్నాడనిన్నీ, ధారాళంగా మాట్లాడుతున్నాడనిన్నీ లెయిర్జియో వ్రాశాడు. నోబిలీ మూడు భాషలను బాగా నేర్చుకున్నాడనిన్నీ, వాటిలోని గుంటచిక్కులన్నీ కూడా నేర్చుకున్నాడనిన్నీ, మతాంతరులైన హిందూ దేశీయుల మతరహస్యాలనన్నిటినీ బాగా గ్రహించడనిన్నీ రాష్ట్రీయాధికారియైన రోస్‌గారు 1613లో వ్రాశారు. ఆ భాషలను కొంత వరకు అభ్యసించిన ఆర్చి బిషప్పుగారు కూడా నోబిలీ యొక్క శక్తిసామర్థ్యాలనూ, పాండిత్యాన్నీ చూచి ఆశ్చర్యపడ్డారు.

## భేషజము-పటాటోపము

ఈ తత్వవేత్త చుట్టూ ప్రజలు గుమిగూడడం ప్రారంభమైంది. కొంద

రీయనను గొప్పవాడని పొగడడం ప్రారంభించారు. ఆయనను చూడాలనీ, ఈయన చెప్పే సంగతులు వినాలనీ కొందరు ఈయన యింటికి పోవటం ప్రారంభించారు. "ఈ క్రొత్త స్వాములవారు ఎక్కడ నుంచి వచ్చారు? ఇతనిది యేకులం? ఈయన సిద్ధాంతాలేమిటి? జీవిత విధానం ఎలాంటిది?" అనే సంగతులన్నీ తెలుసుకోవాలని మధురాపుర జనులలో చాలామందికి కుతూహలం కలిగింది. హిందూదేశపు స్వాముల వార్ల పద్ధతులను నోబిలీ బాగా ఎరిగినవాడైనందువల్ల మొదట తన యింటి నుంచి బయటికిపోలేదు. చూడవచ్చినవారితో చాలా మితభాషణం జరిపే వాడు. నోబిలీని చూడడానికి ఎవరైనా వచ్చినప్పుడు "ఇప్పడు సమయం కాదు, స్వాములవారు సమాధిలో ఉన్నా"రనిగాని, "నిష్ఠలో ఉన్నా"రనిగాని ఆయన శిష్యుడు చెప్పేవాడు. ప్రజలలో కుతూహలం అమితమైపోయిన తరువాత చూడవచ్చినవారు ఒకటి రెండుసార్లు దర్శనం కోసం వచ్చి తిరిగిపోయిన తరువాత నోబిలీ దర్శనం ఇచ్చేవారు. "అయ్యరు'గారితో మాట్లాడడానికి వచ్చాము. చూడడానికి వీలౌతుందా?" అని వచ్చినవారు అడిగితే చాలాసేపటికిగాని దర్శనం ఇచ్చేవాడు కాడు. ఆఖరుకు వారిని లోపలికి రానిచ్చినప్పుడు జేగురురంగు గుడ్డ కప్పివున్న ఎత్తైన ఒక వేదిక మీద ఆయన పద్మాసనం వేసుకొని కూర్చుండి వుండేవాడు. ఆయన ముందు అలాంటి కాషాయరంగు బట్ట యింకొకటి పరచి ఉండేది. దానికి దగ్గరగా ఒక చాప ఉండేది. ఆయనను చూడడానికి వచ్చినవారందరూ చేతులెత్తి ఆయనకు నమస్కరించాలని అక్కడివారు చెప్పేవారు. ఎంత గొప్పవారైనా, రాజోద్యోగులైనా కూడా ఆయనకు అలాగ నమస్కరించేవారు. ఆయన శిష్యులు కాదలచినవారు ఇలాగ మూడు సార్లు భక్తితో నమస్కరించి సాష్టాంగపడి మ్రొక్కేవారు. ఈ సంగతులను ఫిగోరా వ్రాశాడు.

**(సశేషం)**







# సచ్ఛిష్యుడు


- 'ద విజన్' నుండి

1918 ప్రాంతాలలో-సబర్మతీ ఆశ్రమంలో-గాంధీజీ వినోబాభావే దగ్గర భగవద్గీత అధ్యయనం చేస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్ర ప్రార్థన తరువాత బాపూజీ గీత నేర్చుకొన్న తరువాతనే నిద్రపోయేవారు.

వినోబా చాలా దీక్షాపరుడైన గురువు. ఆదర్శప్రాయుడైన శిష్యుడెవరూ అంటే నేర్చుకోదలచినవాడే. అంచేత బాపూ సరైన శిష్యుడే. తొలి అధ్యాయం అలవోకగా నడిచిపోయింది. రెండవ అధ్యాయం సాంఖ్యయోగంలో 54వ శ్లోకానికి వచ్చారు. వినోబా అర్థం వివరించారు.

ఆ మరునాడు గాంధీజీ ఏదో సాకు చెప్పి క్లాసు ఎగ్గొట్టారు. ఆ ఒక్కరోజే కాదు-దాదాపూ ఆ నెలంతా అలా ఏదో ఒక వంక చెప్తూ గీత పాఠాలు ఎగ్గొట్టేసారాయన. వినోబా మాత్రం ఓపికగా వేచి చూస్తూనే ఉన్నారు. హఠాత్తుగా ఒకరోజు గాంధీజీ "రేపటినుండీ మన పాఠం మొదలుపెట్టు కొందాం' అన్నారు. ఇన్నాళ్లూ ఎందుకు నేర్చుకోలేదు? అని అడిగారు వినోబాభావే.

గాంధీజీ చాలా వినయంగా యిలా అన్నారు - "నేను తరగతులు ఎగ్గొట్టాలనుకోలేదు వినోబా! కానీ మీరు 54వ శ్లోకం చెప్పారు గదా! దానిలో మనకున్న కోరికలన్నిటినీ అదుపులో ఉంచుకొని ఆత్మానందాన్ని పొందాలని వ్యాఖ్యానించారు. నేను ఈ నెలంతా దాన్ని అనుభవంలోకీ, ఆచరణలోకీ తెచ్చుకొనే ప్రయత్నం చేస్తూ ఉండిపోయాను. ఆ సాధనలో నాలో నేనే సతమతమయ్యాను. కొంతలో కొంతగా యిప్పడు సాధించ గలిగాను. దానితో యిక నేర్చుకోగలనన్న విశ్వాసం కలిగింది". వినోబా చిరునవ్వు నవ్వారు. అలా నేర్చుకోవటం వల్లనే గాంధీజీ మహోత్ముడైనాడు.



# బాలవాణి
## అర్ధణా

- కన్హయలాల్ మిశ్రా

"నాన్నా, నాకు మిఠాయి కావాలి. డబ్బులివ్వవూ!" నాన్న భుజం మీద వాలి అడిగాను. నాన్న ఏదో అవసరమైన పనిలో ఉన్నారు. పని అయ్యాక తెచ్చిపెడతానన్నారు. "కాదు-నాకిప్పడంటే యిప్పడే కావాల"ని మారాం చేసాను. దానితో నాన్న జేబులోంచి అర్ధణా బిళ్ల తీసి యిచ్చి "పో, నువ్వుల లడ్డు తెచ్చుకో" అన్నారు.

సంతోషంతో గంతులువేస్తూ దుకాణానికి పరుగెత్తాను. అప్పట్లో అర్ధణా బిళ్ల గుండ్రంగా పెద్దగా రూపాయబిళ్లంత ఉండేది. దుకాణదారు అర్ధణా తీసుకొని ఒక నువ్వుండ యిచ్చి, పదిహేను అణాలన్నర తిరిగిచ్చాడు. నేను ఒక చేతిలో నువ్వుండ, మరో చేతిలో చిల్లరా తీసుకొని యింటికి పరుగెత్తాను. డబ్బులు నాన్నగారికిచ్చాను. ఆయన ఆ డబ్బు చూచి నిశ్శబ్దంగా ఉండిపోయారు కొన్ని క్షణాలు. బహుశః అప్పడు "నా వంశంలో యిలాటి నీతిహీనుడెలా పుట్టాడు! అని బాధపడుతున్నారేమో! అటుపైన పదినిమిషాలకు పైగా నాకు సద్బోధ చేసారు-పారుగువాడి సొమ్ము పాము లాంటిది. అలా పరుల సొమ్ము తినటం దైవం మెచ్చని పని-అని.

నేను ఆ చిల్లరంతా తీసుకొని మళ్లీ దుకాణానికి పరుగెత్తాను. "నేను మీకు అర్ధణానే యిచ్చాను. మీరు రూపాయనుకొని యీ డబ్బులిచ్చారు-తీసుకోండి" అని యిచ్చేసాను దుకాణదారునికి. ఆయన చాలా సంతోషించి అణా లడ్డు (పెద్దది) ఒకటి యివ్వబోయాడు. "నువ్వు చాలా మంచివాడివి బాబూ! తీసుకో" అన్నాడు.

నేను "వద్దండీ! మా నాన్నగారు చెప్తే వచ్చి మీ డబ్బు తిరిగిచ్చాను. నా అంతట నేను రాలేదు. అందుకని మీ బహుమతి వద్దు" అంటూ ఇంటికి వచ్చేసాను. జరిగిందంతా విని నాన్న ఎంతో సంతోషించారు. పెద్దలడ్డు





తీసుకోనందుకు ఆయన నన్ను ఎత్తి ఒళ్లో కూర్చోబెట్టుకున్నారు.

"బాబూ! మనం పేదవాళ్లం. పేదరికం పాపం కాదు. నిజాయితీ లేకపోవటం మాత్రం మహాపాపం. పొరపాటున కూడా ఇతరుల డబ్బువైపు కన్నెత్తి కూడా చూడకు" అన్నారు.

సత్యం చెప్తున్నాను - నేటివరకూ నాకు ధనం మీద ఆశ కలగలేదు. ధనలక్ష్మి మాయ నన్ను కప్పబోయేంతలో ఆ అర్ధణా బిళ్ల నన్ను తట్టిలేపుతుంది. అది నన్ను త్రోవ తప్పకుండా కాపాడుతోంది.



# ఆత్మబలం

- "భక్తి కథలు" నుండి

యాదవ ప్రకాశాచార్యుల వారు జ్ఞానోపదేశం చేయుటలో సమర్థులని పేరు వహించారు. విశిష్టాద్వైత సంప్రదాయమునకు మూలపురుషుడైన శ్రీ రామానుజాచార్యులవారు వారి వద్ద చదువుకునే రోజుల్లో ఒక సంఘటన జరిగింది.

గురువైన యాదవ ప్రకాశాచార్యులవారు శిష్యుడైన రామానుజా చార్యులవారి తేజస్సును, బుద్ధి కుశలతను చూచి తనలో తాను అసూయ చెందేవారు. ఆ రోజుల్లో కాంచీపురాధీశ్వరుని కుమార్తెకు పిశాచం ఆవహించింది. అందువల్ల ఆప్తులందరికి మనస్తాపం కలిగింది. దేశదేశాల నుంచి మాంత్రికులను పిలిపించారు. వారంతా రాజకుమార్తె వద్దకు వెళ్లి పిశాచాన్ని వదిలించుటకు శాయశక్తులా ప్రయత్నించారు. కాని ఫలితం శూన్యం.

సదాచార సంపన్నులు, జ్ఞానమూర్తులు, మంత్రసిద్ధులు అయిన యాదవ ప్రకాశాచార్యులవారు తపశ్శక్తి గలవారు గనుక వారిని గూడ పిలిపించమని రాజుగారికి కొందరు సలహా యిచ్చారు.

యాదవ ప్రకాశాచార్యులవారికి తక్షణం బయలుదేరి రమ్మని

రాజుగారి ఆహ్వానం అందింది. వెంటనే తన శిష్యులతో రాజాస్థానం చేరి రాజకుమార్తెను చూచి మంత్రపఠనం ప్రారంభించారు.

అప్పటివరకు ఒక మూల శూన్యంలోకి చూస్తూ కూర్చున్న రాజకుమారి భయంకర రూపంతో లేచి గంభీరస్వరంతో "మాంత్రికుడా! నీ జన్మాంతం మంత్రాలు వల్లిస్తూ కూర్చున్నప్పటికి నన్నేమీ చెయ్యలేవు. నన్ను వెళ్ళగొట్టుటకు నీ చేత కాదు. నేను తలుచుకుంటే యిక్కడనుంచీ నిన్ను తరిమివేయ గలను. నేను సాధారణ పిశాచాన్ని కాదు. బ్రహ్మరాక్షసిని" అని గద్దించింది.

యాదవ ప్రకాశాచార్యులవారు భయపడి అక్కడనుంచి తొలగి దూరంగా వెళ్ళి కూర్చున్నారు. అప్పడు శ్రీ రామానుజాచార్యులు రాజకుమార్తె ముందుకువెళ్ళి "అయ్యా! దయనీయమైన యీ దుర్దశ మీకు కలుగుటకు కారణమేమి? మీకు పిశాచరూపం ఏ విధంగా వచ్చింది? చెప్పగలరా?" అని ప్రశ్నించాడు.

వెంటనే రాజకుమార్తెను ఆవహించిన బ్రహ్మరాక్షసి దుఃఖంతో,

"నాయనా! నేను వేదవేదాంగాలలో ఆరితేరిన పండితుడిని. నా విద్యను పరులకుపయోగపడకుండా దాచుకున్నాను. ఎవరికి గూడా విద్యాదానం చేయలేదు. దాని ఫలితమే యీ దుర్దశకు కారణం. నీవు బాలుడవైనా తేజశ్శాలివి. నన్ను కనిపెట్టగలిగావు. నీవు పుణ్యమూర్తివి. పవిత్రమైన నీ హస్తమును నా శిరముపై ఉంచితే ఈ దుర్దశ నుండి ముక్తి లభిస్తుంది" అని ప్రార్థించాడు.

భగవదంశగల రామానుజాచార్యులు రాజకుమార్తె తలపై తన హస్తమునుంచి ధ్యానించటం ప్రారంభించిన తక్షణమే బ్రహ్మరాక్షసి రాజకుమార్తెను వదలిపోయింది.

అక్కడ చేరినవారంతా రామానుజాచార్యులవారి మహిమను, ఆత్మ బలాన్ని ప్రశంసించారు. ఈ వార్త దేశదేశాల్లోను ప్రచారమై రామానుజా చార్యులను దైవస్వరూపంగా భావించి పూజించారు.





# చిత్రమేముంది?


- శ్రీ ఎం.వి. మాధవరావు

తనకు సర్వస్య శరణాగతుడైన భక్తుడు తప్పత్రోవనబడితే పరమాత్ముడు స్వయంగా రక్షిస్తాడు. మనను కాపాడుకోవటం తల్లి బాధ్యతే గదా! నా జీవితంలో నాకెన్నోసార్లు ఇది ఋజువైంది. నిన్ననే మరోసారి ఋజువైంది. కొంతకాలం క్రితం నేను నా మాతృభూమి కర్ణాటకలో బాగా అనుబంధం ఉన్న ఉడిపి ఆశ్రమానికి వెళ్ళాలనుకొన్నాను. నా వయసు 88. ప్రయాణం చాలా దూరం. అందుచేత గురుదేవుల అనుమతి తీసుకోవాలనుకొని నేనుంటున్న ప్రశాంతి భవనం నుంచి గురుదేవులు ఇన్నేళ్ళుగా నివసించిన 'ఉష' (సాయిధామంలోనే)వైపు వెళ్లాను. "ఈ వయసులో యిది అవసరమా? ఇక ప్రశాంతంగా ఉండండి' అని గురుదేవుల చిత్రపటం నుంచే నాకు సమాధానం వచ్చింది. అంచేత ప్రయాణం విరమించుకొన్నాను. వెంటనే ఆ మాట మాతాజీ, ఆనందం, చంద్రాలతో చెప్పి, 'నేను వెళ్లి వచ్చేందుకు నా కారు ఖర్చులు, తదితరాలు కలిసి ముప్ఫై వేలయ్యేవి. ఆ డబ్బు ఆశ్రమానికే' అన్నాను. కాలం గడిచిపోయింది-కొన్ని నెలలు. ఆ విషయం మరుగునపడిపోయింది.

ఇవ్వేళ ఉదయం ఆశ్రమ బాలిక చి॥సాయిసుధ నా గదికి వచ్చింది. ఆమె ఏం చదువుతున్నదో అడిగాను. తెనాలిలో హాస్టల్లో ఉండి ఇంటర్ చదువుతున్నాననీ, ఫస్టియర్ పరీక్షలు వ్రాసి వచ్చాననీ చెప్పింది. ఫీజెంత అని అడిగితే కాలేజీకి, హాస్టల్‌కి కలిపి ఇరవై ఏడు వేల చిల్లర అని చెప్పింది. మొత్తం ఆశ్రమమే కడుతుందన్నది. వెంటనే నాకు 'యీ పిల్ల ఆశ్రమం పిల్ల అంటే సమాజం బాధ్యత వహించాలి. అది నేనెందుకు కాకూడదు?" అనిపించింది. సాయిసుధను ఒక్క నిమిషం ఆగమని చెక్కు పుస్తకం తీశాను. చిల్లరగా వ్రాయడం ఎందుకులే అనిపించి ఆశ్రమం పేరిట ముప్ఫై

వేలకు చెక్కువ్రాసి ఆ పాపకు యిచ్చి, మాతాజీకిమ్మని చెప్పాను. ఆమె వెళ్లిపోయింది.

ఒక్క రెండు నిముషాల తరువాత నా బుర్రలో తళుక్కున మెరిసింది. "అరె! నేను ఉడిపి ప్రయాణం ఆగిన డబ్బు ఆశ్రమానికిస్తానన్నాను. నా మతిమరుపు సరిదిద్దడానికి భగవంతుడు ఈ సన్నివేశం కల్పించాడు. ఈ పేరున తన డబ్బు తాను వసూలుచేసుకున్నాడు. నన్ను వచన భ్రష్టుడిని-ఆడి తప్పినవాడిని కాకుండా రక్షించాడు. నమ్మిన వారిని పతనం కాకుండా ఎలా కాపాడుకుంటాడు ఆ తండ్రి!" నా సుదీర్ఘ ప్రయాణంలో మరోసారి ఆయన చెప్పాడు - "నేను నీ ప్రతి కదలికా, ప్రతి మాటా, ప్రతి ఆలోచనా గమనిస్తూనే ఉన్నా-నీవు తడబడుతున్నావా నా చెయ్యి అందించి నిలబెడతాలే! నీకు నేనున్నాగా!' ఆ స్వామికిదే ప్రణామం.



# శిలారోదనం-3

- భేరి సోమన్న

రాముని పాదధూళి పడ
    రాతికి ప్రాణము వచ్చెగాదె, యా
సోముని కాంతి చంద్రికల
    సోనల నీనును చంద్రకాంత మే
కోమల గానమున్ వినరో కో
    శిలదీర్చిన కంబమందు, మీ
రేమి కతంబు మమ్మిటుల
    నేడ్పుల పాలగునట్లు సేయగన్ 8






శిల్పి సుత్తికి లొంగి శిల్పంబు భావార్థ
    మును నింపునే మెత్తదనము లేక!
గుండెలు కరుగగా వెండి బంగారులౌచు
    మెడ మురిపించునే మెతగ కాక
గుడిలోని మూర్తిగా కోర్కెలు దీర్చునే
    కఠినంపు గుండెలు కలిగియున్న
ఎందు వేసిన నందె ఏండ్లుగా పడి కొల్చు
    చుండునే మెత్తని గుండె లేక
భస్మమై రోగముల బాపు, పప్పరుబ్బు
గ్రహపీడల బాపు నుంగరము లెక్కి,
ముద్దగట్టిన కారుణ్యమూర్తి రాయి
కంటివెచ్చట రాతిలో కరుకుదనము? 9

పశువు, శిసువును పాముసు పాట వినుచు
పరవశించును, కరుగును బండలైన,
కరుగనిది మానవాధము కరుకు గుండె
కఠిన మెద్దియో తెలుసుకో కపటి నరుడ! 10

అనుచు రోదించె రుబ్బురోల య్యె వేళ
శివుని పూజకు తరలితి చెంతనున్న
గుడి కడుగడుగునందు రాళ్లడుగు చుండె
కరుగుదనమేమి మాలోన కంటివనుచు. 11

# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

(గత సంచిక తరువాయి)

## 14వ అధ్యాయం

మెహెకర్ ప్రాంతంలోని ఒక గ్రామంలో ఒకానొక పేద బ్రాహ్మణుడుండేవాడు. అతడు పేదవాడైనా ధర్మపరుడు, దయాస్వభావం కలవాడున్నూ. ఆ బందూతాత్యా తన యింటికి వచ్చినవారందరికీ అతిథిమర్యాదలు చక్కగా చేసేవాడు. అతిథులంటే దైవస్వరూపాలేనని అతని భావన. వాళ్ల కోసం తన ఆదాయం చాలకపోతే అప్పలు కూడా చేయవలసివచ్చేది. అలా ఒక వడ్డీ వ్యాపారి దగ్గర తెచ్చిన అప్ప బాగా పెరిగిపోయింది. తన యిల్లూ, వాకిలీ అమ్మినా-పాత్ర సామగ్రితోసహా తాకట్టుపెట్టినా యింకా అప్ప కొంత మిగిలే ఉంది. అప్పల వాళ్ల నౌకర్లు తాత్యా యింటి మీదికి వచ్చి అతన్ని తిట్టేవారు. భార్యాపిల్లలు కూడా అతన్ని అసహ్యించుకోసాగారు. బందూతాత్యాకు ఊళ్లో గుప్పెడు పిండి కూడా పుట్టడం మానేసింది. అతనికి ఆత్మహత్య చేసుకుందామంటే విషం దొరికే అవకాశం కూడా లేదు. చివరికతడు హిమాలయాలకు వెడదామనుకొన్నాడు.

"స్వామీ, పరమాత్మా! నీవు పరమనిర్ధనుడిని కూడా కోటీశ్వరుడిని చేయగలవని శాస్త్రాలు చెప్పాయి. కానీ, నా జీవితాన్నిలా చేసావు. హరి ద్వారం దగ్గర గంగలోబడి ప్రాణత్యాగం చేస్తాను. నీవు నాకదే యిచ్చావను కొంటాను"-అని ప్రార్థన చేసుకొని రైల్వేస్టేషనుకు వెళ్లాడు. అక్కడొక బ్రాహ్మణుడు కలిసి అతన్ని గజానన మహారాజుల దర్శనం చేసుకొమ్మనీ, అది తప్పక సత్ఫలితాలనిస్తుందనీ చెప్పాడు. ఆ బ్రాహ్మణుడెవరో తానేమీ చెప్పకుండానే అలా ఎందుకు చెప్పాడో తాత్యాకు అర్థం కాలేదు. కానీ, షేగాఁవ్ వెళ్లాడు. గజాననుల ఎదుట నిలబడగానే ఆయన -





"హిమాలయాలలో చావడం దేనికి? ఆత్మహత్య మహాపాపం. ఆశ విడువకూడదు. జీవితంలో గెలుపుకోసం ప్రయత్నం చేస్తూనే ఉండాలి. ఒకవేళ నీవిప్పుడు చనిపోయినా యీ ప్రారబ్ధానికి తోడు ఆత్మహత్యా పాపాన్ని కూడా పైజన్మలో అనుభవించవలసి వస్తుంది. అంచేత నీవు చావు గురించిన ఆలోచనలు మాని యింటికి వెళ్లు. నీ యింటి పెరటిలో మానోబా విగ్రహం ఒకటి ఉంది గదా! దానికి తూర్పుగా ఉన్న కసింద చెట్టు క్రింద అర్ధరాత్రి దాటాక తవ్వు. నువ్వే స్వయంగా తవ్వాలి సుమా! మూడడుగులలోతు తవ్వితే అక్కడ ఒక గుప్త నిధి దొరుకుతుంది. దానితో అప్పలు తీర్చి నీ భార్యాబిడ్డలతో హాయిగా బ్రతుకు" అన్నారు.

దానితో తాత్యా వెనుదిరిగి యింటికి వచ్చాడు. మహరాజు చెప్పినట్లే కసింద చెట్టు క్రింద ఒక రాగి పాత్ర నిండుగా బంగారునాణేల నిధి దొరికింది. ఆ ధనంతో అప్పలన్నీ తీర్చుకోవటమేగాక బందూతాత్యా కుటుంబం హాయిగా జీవించసాగింది. మునిగిపోయే ఓడలో ఉన్న వాడికి మరో మంచి నౌక ద్వారా రక్షణ దొరికినట్లు, శవం మీద అమృతం చిలికినట్లు అయింది తాత్యా పని. అతడు మళ్లీ షేగాఁవ్ వెళ్లి గజాననులకు పాద నమస్కారం చేసాడు. వారు "నాకెందుకు నమస్కరిస్తావు? ఆ సొత్తు నీకిచ్చిన పరమాత్మకు నమస్కరించు. ఇక నుండీ జాగ్రత్తగా ఉండు. నీ దగ్గర డబ్బు ఉన్నప్పుడు చుట్టూ చేరిన వారెవ్వరూ ఆ తరువాత మొహం చూపరు. భగవంతుడొక్కడే నీకు ఆపదలో తోడయ్యేవాడు" అన్నారు. అటుపైన బందూతాత్యా జీవితం ప్రశాంతంగా గడిచింది.

(సశేషం)



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే
అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

12-03-1912

సాయిమహరాజు బయటికి వెళ్లటం చూచాను. మసీదుకు తిరిగి రాగానే నేను కూడా వెళ్లాను. నేను కూర్చోగానే సాయిబాబా "ప్రజలు మూర్ఖులు. నేను భౌతికంగా కనపడకపోతే యిక్కడ లేననే అనుకుంటారు. నేను ఉదయం పింపల్‌గావ్ వెళ్లాలనుకుంటున్నాను" అన్నారు. నలుగురు మనుషులు అక్కడి నుంచీ వచ్చారు. వాళ్లు ఆయనతో మసీదుదాకా వచ్చారు. సంభాషణ పెళ్లిళ్లవైపు సాగింది. సాయిబాబా అక్కడ కడుతున్న కొత్త గోడ వైపు చూపిస్తూ -అక్కడొక త్రోవ, ఒక సన్నని చెట్టు ఉండేవన్నారు. "అక్కడొక ముసలాయన కూర్చునేవాడు - ఆయన పవిత్రుడు. అతడు జాల్నా నుండీ వచ్చాడు. పన్నెండేళ్లపాటు అతని తమ్ముడు, కుటుంబం ఎన్ని కష్టాలుపడినా తిరిగి వెళ్లలేదు. చివరికెలాగో తిరిగి వెళ్లడానికి ఒప్పుకొన్నాడు. అతను గుర్రమెక్కితే, సాయిబాబా బండి మీద వెంట వెళ్లాడు. జాల్నా చేరారు. ఆ ముసలాయన తన భార్య తోను, ఎదిగిన నలుగురు కొడుకులతోను అక్కడుంటున్నాడు. హఠాత్తుగా అన్న కూతురును పెళ్లాడ దలచుకున్నాడు. అందరూ హేళనగా నవ్వినా పెళ్లి అయిపోయింది పెళ్లికూతురు చాలా చిన్నది. చివరికి పెద్దదయ్యాక అతనికి ఒక కొడుకును కన్నది. ఆ పిల్లవాడికి ఆరేళ్లు వచ్చేటప్పటికి ముసలాయన చచ్చి పోయాడు. పిల్లవాడికి అన్నలు విషం పెట్టారు. యువవితంతువూ, బిడ్డను కోల్పోయిన తల్లీ అయిన ఆ పిల్ల పవిత్రమైన జీవితం గడిపింది. పునర్వివాహం చేసుకోలేదు. చివరికి చనిపోయింది. ఆ పిల్లవాడు బాబుగా పుట్టి చనిపోయాక - మళ్లీ యిప్పుడు బొంబాయిలో పుట్టాడు.





పరమాత్ముని చర్యలు ఇలా కళాత్మకంగా ఉంటాయి" అన్నారు.

13-03-1912

మేము సాయిమహరాజు బయటికి వెళ్లటం తిరిగి మసీదుకు రావటం కూడా చూచాము. ఆయన ఓ పెద్ద కథ చెప్పారు. ఒక వృద్ధ పాటిల్ తనను దర్శించ వచ్చాడు. మొదట నలుగురు - తరువాత పన్నెండుమంది దాకా డిటెక్టివ్‌లు అతని మీద నిఘా పెట్టారు. ముసలాయనా, వాళ్లూ ఒకరినొకరు కఠినంగా ఏవో అనుకొనేవారు. చివరికోసారి ద్వంద్వ యుద్ధం జరిగింది. సాయిసాహెబ్ ఆ వృద్ధుడిని అభిమానించారు. ఈ సందర్భంలో ఒకసారి కలుసుకున్నారు డిటెక్టివ్‌లు అతని మీద బలప్రయోగం చేసినపుడు. గోవిందదాస్‌ను కొట్టారు కూడా. చివరికి ఆ వృద్ధుడిని విచారణకని పెద్ద పట్టణానికి తీసుకువెళ్లారు. కానీ, సాయిబాబా కల్పించుకొని, అతన్ని విడిపించారు.

(సశేషం)

## స్వరాంజలి
## మమ గురుదేవా!

ఓం గురుదేవా శ్రీ గురుదేవా
శ్రీ గురుదేవా మమ గురుదేవా
మమ గురుదేవా శ్రీ ప్రభుజి దేవా ॥ ఓం ॥
ప్రేమావతారా ఓం గురుదేవా
శాంతస్వరూపా మమ గురుదేవా ॥2॥ ॥ ఓం ॥
కారుణ్యసాగర శ్రీ గురుదేవా
ఆశ్రితవత్సల మమ గురుదేవా ॥2॥ ॥ ఓం ॥
నీరేజ నయనా ఓం గురుదేవా
దరహసిత వదన మమ గురుదేవా ॥2॥ ॥ ఓం ॥
త్యాగైక జీవన శ్రీ గురుదేవా
సుజ్ఞాన ఘనా మమ గురుదేవా ॥2॥ ॥ ఓం ॥

# గురు వాణి-4

ప్రియ బాంధవులారా,

సర్వాత్మ స్వరూపులారా,

సత్సంగం అన్నది భవరోగానికి తిరుగులేని ఔషధం. ఆదిశంకరాచార్యుల వారు సత్సంగత్వంతోనే లౌకికసంగాల నుండి (బంధాల నుండి) విముక్తి లభిస్తుందనీ, ఆ నిస్సంగత్వం నుండే ఎడతెగని మోహవినాశనం కల్గుతుందనీ సెలవిచ్చారు. సంగమూ, మోహమూ నశిస్తే, మనస్సుకు చాంచల్యం వదిలిపోతుంది. నిశ్చలమైన మనస్సు మోక్షమార్గంలో ప్రయాణం సాగిస్తుంది అన్నారు వారు. సత్సంగత్వానికి ఉన్న శక్తి చాలా అమోఘమైనది. అందులోను మహనీయులతో సాంగత్యం దొరకటం అన్నది చాలా కష్టమయిన విషయం.

"మహత్సంగస్తు దుర్లభో2గమ్యోమోఽఘశ్చ" అన్నారు నారద మహర్షి తమ భక్తిసూత్రాలలో. దీనినిబట్టి మహత్ పురుషుల సాంగత్యం అత్యంత కష్టం మీదనే దొరుకుతుందని అర్థమవుతున్నది. అది ఎంత అమోఘమైనదో పుండలీకుని చరిత్రలో తెలుస్తుంది. పుండలీకుడు కుక్కుట మహర్షి ఆశ్రమంలో వేకువజామున ముగ్గురు స్త్రీలను చూచాడు. వారు పరమవికారంగా ఉన్నారు. అచ్చు పిశాచాల్లాగ. అయితే వారు గబగబ ఆశ్రమమంతా ఊడ్చి నీళ్ళుజల్లి ముగ్గులు వేసేటప్పటికి వారికి ఆ వికారస్వరూపాలు పోయి దివ్యస్వరూపాలు వచ్చాయి. అవి చూచి పుండలీకుడు ఆశ్చర్యచకితుడై, "అమ్మా, మీరు ఎవరు? మీ రూపాలు యిలా మారటానికి కారణం ఏమిటి?" అని ప్రశ్నించాడు. వారు తాము గంగా,





యమునా, సరస్వతీ నదులమనీ, తమలో స్నానమాడే భక్తుల పాపాలు సోకి వికృతరూపాలు వచ్చాయనీ, పరమపవిత్రుడైన కుక్కుట మహర్షి ఆశ్రమ సేవ చెయ్యటం వలన తమకు పాపవిముక్తి కలిగి స్వస్వరూపాలు వచ్చాయనీ చెప్పారు.

గంగానదికి ఎక్కువ పవిత్రత రావడానికి కారణం త్యాగశీలురు, శాంత స్వభావులు, ధర్మపరాయణులు అయిన లోకపావనతత్వరులు పదేపదే స్నానం చేయడమే అని పెద్దలంటారు. కనుక సత్సాంగత్యాన్ని మించి పవిత్రీకరించగలిగిన సాధనం మరొకటి లేదు.

**"మోక్షద్వారే ద్వార పాలాశ్చత్వారః పరికీర్తితాః**

**శమో విచారస్సంతోషశ్చతుర్థస్సాధు సంగమః"**

- మోక్ష భవనానికి నాలుగు ద్వారాలు. వాటికి ద్వారపాలకులుగా శమం (ఇంద్రియ నిగ్రహం), విచారం(ఆత్మావలోకనం), సంతోషః (లభించిన ప్రతి దానికి ఆనందంగా ఉండటం), సాధుసంగమం అన్నవి ఉంటాయి. మొదటి మూడింటిని మనం స్వయంగా సాధించుకోవాలి. నాలుగవది సాధుసంగమం మాత్రం పెద్ద కష్టపడకుండానే సాధించుకోవచ్చు. కానీ వారు అచ్చమైన సత్పురుషులై మనకు సద్ధర్మమార్గం చూపగలవారై ఉండాలి. ఒకే భావపరంపరలో ఉన్న వ్యక్తులు సాధారణంగా ఒకే రకపు విషయం గూర్చి మాట్లాడుకుంటారు. అలా కాకుండా సత్సంగంలో కొందరు విషయాన్ని పక్కకు లాగేవారుగానీ, లౌకికవిషయాల వైపు సంభాషణ మరలించేవారుగానీ, వాదోపవాదాల కోసమై చర్చ పెట్టేవారుగానీ ఉన్నప్పుడు సత్సంగంలోన ఉన్న వారి ఏకాగ్రత దెబ్బతినే అవకాశం ఉంది. అందుచేత అలాంటివి లేకుండా చూసుకోవడం మంచిది.

**"త్యజ దుర్జన సంసర్గం భజసాధు సమాగమమ్**

**కురు పుణ్యమహోరాత్రం స్మర నిత్య మనిత్యతామ్"**

ఆర్యులు (పూజ్యులైన మన పెద్దలు) ఇలా శాసించారు-దుర్మార్గులతో స్నేహాన్ని కలయికను వారెంత దగ్గరవారైనాగానీ-వదిలివేయడం మంచిది. సాధు సజ్జనులతో ప్రయత్నపూర్వకంగానైనా కలుస్తూ ఉండాలి. రేయింబవళ్ళు పుణ్యకార్యాలే చేస్తుండాలి. ఏది నిత్యమో, ఏది అనిత్యమో పదేపదే స్మరణ చేస్తూ ఉండాలి". అందుచేత నాయనలారా, నివృత్తి మార్గంవైపు పయనిస్తూ మనకన్నా ముందర వెడుతున్న మహనీయులతో సంపర్కం ఏర్పరచు కోవాలి. వాళ్లతోపాటు మనను కూడా నడుపుతారు. తథాకస్తు.

# గురువుగారితో కబుర్లు

గురువుగారండీ!

మీకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పాలని మీవాళ్లు కొందరు ఉగాదినాడు వచ్చారు. జ్ఞానధామంలోకి వచ్చి, నమస్కరించు కున్నారు కూడా. పోయిన ఉగాదినాటి సాయంత్రం మనం అనుకొన్నాం-"వచ్చే(ఈ) ఉగాదికి రజతోత్సవం జరపాలనీ, దేవాలయానికి కూడా రెండు పదులు నిండుతాయి గనుక పెద్దఎత్తున నిర్వహించాలి ఉత్సవాలు-అనీను". భగవదుద్దేశ్యం వేరే ఉన్నది. మాకీ పరీక్ష పెట్టాడు.

ఉగాదికి ఎప్పుడూ మీరు వేపపువ్వు పిల్లలను వెంటేసుకువెళ్లి దులుపుకు రావటం, నేను పచ్చడి కలపటం, పిల్లలంతా పదార్థాలన్నీ సమకూర్చటం ఆనవాయితీగా వస్తోంది గదా! మీ ఫోటో చూస్తూనే పనిచేసాం. ఏటా మీరు, ఆనందంగారు మళ్లీమళ్లీ పెట్టించుకొని తింటారు మన పచ్చడి. పిల్లలు సరేసరి. 'చాలా బాగా కలిపావు' అంటారు కూడా





మీరు. ఈసారి మారు అడగటం కాదు గదా-మొదట యిచ్చిందే ఆనందంగా తినలేకపోయారు. వేపపూతకన్నా, బెల్లం రుచికన్నా పులుపు ఎక్కువై పోయింది. చూచారా గురుదేవా, మీరులేరు-మా బ్రతుకుల రుచి మారింది.

1991లో 'సాయిధామం' అని నామకరణం చేసినప్పుడు మన ఆశ్రమానికి గురుతుల్యులు శ్రీ మహాభాష్యం రంగాచార్యులవారు నామ ఫలకం స్థాపించారు రోడ్డుపైన. మీ ఆదేశం మేరకు ఆనాడు పండగా, పబ్బమా అని ఆలోచించకుండా యీ చిట్టడవి(నాడు)లోకి ప్రొద్దున్నే వచ్చి పారాయణ చేసారు ఇరవైమందికి పైగా భక్తులు. అందరికీ ఏదో ఒక మహదానందమే తప్ప యిళ్లూ, వాకిళ్లూ గుర్తులెవ్వరికీ. కానీ మాయ బలమైంది గదా గురుదేవా! మీరే ప్రారంభించారు పారాయణ- ఆనాడు మనం వేసుకొన్న 8 × 16 తడికల (ప్రక్కనా, పైనా అంతా) హాలులో. 2016 ఉగాదినాటికి మార్గదర్శకులు మీరూ లేరు, 'బోర్డు' స్థాపించిన రంగాచార్యుల వారూ లేరు, మన మీద ఎంతో అభిమానం చూపిస్తూ వచ్చిన ఎస్వీ పార్థసారథిగారూ లేరు, మీకు ప్రీతిపాత్రులై తోడు నిలచిన వర్షా మాణిక్యారావుగారూ లేరు-నేను మాత్రం ఉన్నాను శిలలా పాతుకుపోయి.

మేము మీవెంట నడిచే పరమసౌభాగ్యాన్ని మాకు ప్రసాదించిన పాత రోజులను గుర్తు చేసుకోవటం కోసం సాయిధామం పుస్తకం చదువుకొన్నాం గురువుగారూ! రామాయణం అంతటా శ్రీరాముని విశ్వ రూపమే కనిపించినట్లుగా ఆ గ్రంథం ప్రతిపేజీలో మీరే, మీ మాటలే, మీతో కబుర్లే, అక్కడక్కడా ఆనందాలు, కొద్దిచోట్ల విషాదాలు-అన్నీ మీతోనే అల్లుకుపోయిన మా జీవితాలు... ఓ చిరునవ్వు, ఓ కన్నీటిచుక్క పందెం వేసుకు నడిపినట్లుగా నడిచింది పారాయణ. ఏదో ఒక సంతృప్తి కలిగింది, ఎన్నిచోట్ల పొరపాట్లు చేసామోనన్న కుమిలింపూ కలిగింది. ఒక్క ఏప్రిల్

29వ తేదీ, 1991లో వైశాఖ పూర్ణిమనాటి రాత్రి మనమందరం వేసవి శిక్షణ శిబిరం నడపడానికి, సామగ్రితోసహా (లారీలో నింపి) యిక్కడికి వచ్చాము తొలిగా. అటుపైన '92 ఏప్రిల్ 27న పూర్తిగా నివాసానికి వచ్చేసాము. ఆ రెండు రోజులూ ఆ స్మృతులతో నా మనసు క్రుంగిపోయింది గురుదేవా, ఒక వరమివ్వరూ!

నా జీవితంలో మిగిలిన కొద్దికాలంలో క్షణక్షణమూ మీతోనే గడవనివ్వండి. నిదురలోనైనా మీ స్మృతి నాలో చెదరనివ్వకండి. ఉసురులు నా తనువును విడిచి వెళ్లేవేళ కూడా నా కన్నులలో మీ రూపం, పెదవిపై మీ నామం, మనసులో మీ ప్రేమా నిలిచి ఉండే వరమివ్వండి గురుదేవా! అది చాలు -

**మీ, పిచ్చితల్లికి.**

# మాతృసంస్థ కబుర్లు

ఫాల్గుణ మాసం వచ్చింది. ప్రతిసారీ యిది సాయిధామానికి క్రొత్త ఉత్సాహం తెస్తుంది. ఈసారి మాత్రం దుఃఖాశ్రువులూ, స్మృతిలో కలిగిన ఆనందాశ్రువులు సమ్మిళితం చేస్తూ వచ్చింది. ఫాల్గుణ విదియ పరమ పూజ్యులైన గురుదేవుల జన్మదినం-జయంతిగా మారి, మాకొక సంస్మరణ దినంగా నిలిచిందీసారి. గురుదేవుల పేరిట పోస్టర్లు, కటౌట్లు వెలిసాయి. కరపత్రాలు ఊరూరా వెళ్లాయి. ఎప్పటిలాగే గురుదేవులంటే ఎంతో అభిమానం చూపించే శ్రీశ్రీశ్రీ దివ్యజ్ఞానానంద భారతీస్వామి వారు 24 మార్చి (పాడ్యమి)నాడే వచ్చేసారు. వైజాగ్, రేపల్లె, హైదరాబాదుల నుండీ వచ్చిన కొంతమంది భక్తులతో సందడి మొదలైంది. ఆ రాత్రి గురుదేవుల కబుర్లతోనే నడిచింది. తెల్లవారింది.

ప్రతిఏటా గురుదేవులకు నూనె రాసి అభ్యంగనానికి ఏర్పాట్లు చేసే





ఆనందం, చంద్రం, రాము చిన్నబోయిన ముఖాలతో తిరుగుతున్నారు. 'తూర్పుకు తిరిగి కూర్చోండి' అని స్టూలు వేసి, మాతృస్థానంలో నిలబడి, "అమ్మ కడుపు చల్లగా, అత్త కడుపు చల్లగా నూరేళ్లు వర్ధిల్లండి నిండుగా" అంటూ మాడున తొలినూనె అంటే భాగ్యం పోగొట్టుకున్న మాతాజీ కళ్లు అవిరళంగా కురుస్తూనే ఉన్నాయి. నాయర్‌గారు వచ్చి తమ సేవా విభాగమైన వంటలో మునిగిపోయారు. వారి చిన్ననాటి మిత్రులు కేరళ నుంచీ వారిని చూడడానికి వస్తే వారిని కూడా తీసుకువచ్చి రంగంలోకి దింపి మరీ నాయర్‌గారు తమ స్థితప్రజ్ఞత్వాన్ని చాటుకున్నారు. అలాఅలా పదిగంటలైపోయింది.

ద్వారవతిలోను, జ్ఞానధామం (ఇంకా నిర్మాణం పూర్తికాక పోయినా గురుదేవుల సమాధిపూజ జరుగుతూనే ఉంటుంది రోజూ) పుష్పాలతో అలంకరించారు. దీపాలంకరణ చేసారు. శ్రీ సాయిపూజ తరువాత గురు పాదుకా పూజ ప్రారంభమైంది. నీళ్లు నిండిన కళ్లకు ఎవరి ముఖమూ కనిపించటం లేదు సరిగా. కుర్చీనిండా పూల అలంకరణ మధ్య గురుదేవుల చిత్రపటం జాలిగా చూస్తోందా? కొంటెగా చూస్తోందా? 'నన్ను పట్టగలిగారా, గుర్తించగలిగారా?' అని అడుగుతోందా? ఏవేవో భావాలు. పూజానంతరం గురుదేవులతో బహుకాల అనుబంధం ఉన్న భక్తులు, అభిమానులు కొందరు తమ మనోభావాలు అందరితో పంచుకున్నారు.

ముందుగా శ్రీ కె.చంద్రారెడ్డిగారు(గురువుగారు పిలిచే పేరు ధర్మారెడ్డి) మాట్లాడుతూ గురువుగారి ప్రేమాభిమానాలను ప్రస్తావించారు. జ్ఞాపకాలు కలబోసుకొంటూ వారి నిర్యాణం తరువాత వారి స్మృతి, ప్రభావం తన మీద మరీ ఎక్కువగా క్షణక్షణం ప్రసరిస్తూ, తమకు ఆనందాన్నీ, ఆయనకు దూరమైన బాధనూ కూడా కలిగిస్తున్నాయని చెప్తూ కన్నీరుమున్నీరుకాగా ముగించారు. తరువాత ఒక్కరొక్కరుగా తమ అనుభవాలు చెప్పారు. శ్రీ ఎడ్ల నారాయణరెడ్డిగారు తమకు సేవాసక్తి ఉండటమూ, గురువుగారు సమాజకార్యాలవైపు ఎక్కువ మొగ్గుచూపటం, సత్సంగాల నాటి నుండీ

పెరుగుతూ వచ్చిన అనుబంధం గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, కోజాగిరి, గ్రామీణ యువ క్రీడా పోటీలు, కిశోరచేతన మొదలైన కార్యక్రమాలలో తాము కూడా భాగస్వామ్యం వహించటం వంటి విషయాలు గుర్తు చేసుకున్నారు.

శ్రీ నారాయణరావుగారు (విహెచ్‌పి) మాట్లాడుతూ, తమ సంస్థ తరపున మొదటిసారి గురువుగారిని కలుసుకోవడానికి ఆశ్రమానికి వచ్చానని, తామెందుకు అందులో పనిచేస్తున్నామో కనుక్కొని పని సవ్యంగా నడవడానికి చక్కని సలహాలిచ్చారనీ, ప్రతిసారీ ఎంతో ప్రేమగా పలకరించటం, సహకారం అందించటం జరిగేవనీ చెప్పారు. తాము ఎందరో సాధువులను కలుసుకున్నామనీ, సరి అయిన సాధు లక్షణాలు, దేశభక్తి పెనవేసుకుపోయిన వారు శ్రీ ప్రభుజీ వారనీ నారాయణరావు గారన్నారు. వైజాగ్ శ్రీమతి జయ మాట్లాడుతూ తాను ఎప్పుడు వచ్చినా గురువుగారికి నమస్కరించగానే తలపై చేయి ఉంచి ఆశీర్వదించే వారనీ, యిప్పటికీ వారి ఫొటో ముందు మోకరించగానే ఆ చేతి స్పర్శ శిరస్సున ఉన్నట్లే ఉంటుందనీ అన్నారు. ప్రేమమయమైన వారి పలకరింపు ఎంతో స్థైర్యాన్నిచ్చేదనీ, వారి సరళమైన స్వభావం, భేషజం చూపని కరుణ మరపు రానివనీ అన్నారు.

శ్రీమతి ఇందిరా రవీంద్రరెడ్డిగారు మాట్లాడుతూ "బాగున్నావా అమ్మా!" అన్న చిరునవ్వుతోడి పలకరింపుకే కడుపు నిండిపోయినట్లుండేది. ఎటువంటి సమస్యలతో వచ్చిన మనసు చల్లబడేది. ఇప్పడు ఆశ్రమంలో అడుగుపెట్టగానే ఆ వెలితి గుండెను పిండినట్లవుతుంది" అన్నారు. తరువాత డా॥ఝూన్సీగారు తమ పరిచయం ఆశ్రమంతో బలపడటం గురుదేవులు అనారోగ్యం బారినపడిన దగ్గరినుంచీ పెరిగిందనీ, పదేపదే రావటం జరిగేదనీ అన్నారు. తమను ఏ విధంగా సేవలోకి తీసుకుంటారో పూర్తి అవగాహన కలగకుండానే గురుదేవులు వెళ్లిపోయారనీ, తానెప్పడైనా ఆశ్రమసేవకు సిద్ధమేననీ, మాతాజీ ఎలా మార్గోపదేశం చేస్తే అలా





చేస్తాననీ కన్నీళ్లతో చెప్పారు. చివరగా శ్రీ ప్రేమ్‌కుమార్‌గారు మాట్లాడారు. వారు తాము 15 ఏళ్ల క్రితం సాయిధామంలో ఉద్యోగంలో చేరినప్పటి విషయాలను జ్ఞాపకం చేసుకున్నారు. "నాకిక్కడే పెద్దకొడుకు పుట్టాడు. వాడు బోర్ల పడేటప్పడు బొబ్బట్లు పెట్టాల్సిందేనని నా తోటిమిత్రులంతా అడిగారు. అది గురువుగారు ఎక్కడ విన్నారో తెలీదు. మరునాడు వాకింగ్‌కు వచ్చినప్పడు మా గది ముందర ఆగారు. నన్ను బయటకు పిలిచి "ఏమయ్యా బొబ్బట్లు చేయిస్తున్నావా? అని అడిగారు. నెలాఖరు-ఏం జవాబు చెప్పాలో తెలీక మథనపడుతున్నాను. అంతలో గురుదేవులు చిన్నగా నవ్వి తమ చేతిలోని డబ్బు నాకు అందించారు. 'ఆ పనిచూడు, ఇవ్వాళ చేయించి పెట్టు" అన్నారు. అలా దూరదృష్టితో ఎదుట వారి కోణంలో నుండి ఆలోచించగల సహృదయం వారిది. నేనెంత జారిపోతున్నాగానీ పైకి లాగి నన్ను తమ నీడలోనే నిలుపుకున్నారు. అటువంటి ప్రేమమయులు వారు" అని చెప్పారు.

అటుపైన మాతాజీ గురుదేవులతో తమ అనుబంధాన్ని అక్కడక్కడా స్పృశిస్తూ కొద్దిసేపు మాట్లాడారు. చివరిలో వారు "ఉన్ననాడు చేసింది కాపురం కాదు. లేనినాడు చేసిందే కాపురం అని పెద్దలంటారు. గురుదేవులు ఉన్నప్పడు వారి బోధ బాగున్నదనో, చెప్పే విధానం బాగున్నదనో, సుత్తిమెత్తగా, ఆప్యాయంగా మాట్లాడతారనో, ఆర్తితో ఉండో, ఆధ్యాత్మిక లబ్ధి కోసమో, ఏవేవో లౌకిక బాధలు తీరడానికో, మానసిక ప్రశాంతత కోసమో! ఏదో ఒక కారణంతో ఆశ్రమానికి వచ్చేవారు భక్తులు. అవన్నీ వారికీ ఆనందాన్ని కలిగించేవి. ఇప్పడు గురుదేవులు లేరు. కానీ, వారి భావనాప్రపంచంలో రూపుదిద్దుకొని వారి నడతతో, పలుకులతో, నివాసంతో పవిత్రత సంతరించుకున్న ఆశ్రమం యిక్కడే ఉంది. వారు తలపెట్టిన పనులు పూర్తిచేయడం, మొదలైన వాటిని కొనసాగించడం భక్తులందరి విధ్యుక్తధర్మం. గురుదేవులు ఏ లక్ష్యం కోసం జీవించారో దానివైపే నడుస్తూ ఆ లక్ష్య సాధన పరిపూర్ణం కావడానికి మనం క్షణక్షణం

శ్రమించాలి. అదే గురువులకు చేయవలసిన భావసేవ. ఇక్కడున్న ప్రతివారు గత 8 మాసాలలో ఎన్నిసార్లు ఆశ్రమానికి వచ్చామో, ఆశ్రమం గూర్చి, దాని క్షేమం గూర్చి ఆలోచించామో, ఎంత సమయాన్ని గురుకార్యం కోసం వెచ్చించామో ప్రశ్నించుకుని చూస్తే మనం ఎక్కడ ఉన్నామో మన కర్తవ్యం ఏమిటో మనకే బోధపడుతుంది. గురుఋణం కొద్దిగానైనా తీర్చుకోడానికి ఇదే, ఇదొక్కటే మార్గం" అని ప్రవచించారు. మహాహారతి తరువాత భక్తులందరూ నాయర్‌గారు ఏర్పాటు చేసిన రసభరితమైన విందు ఆరగించి వెళ్లారు.

అదేరోజు గురుదేవుల జన్మనక్షత్రంలోనే చి॥ హరికృష్ణ, చి॥సౌ॥స్వర్ణలకు ఆడపిల్ల పుట్టడమూ, ఆ శిశువుకు 'సాయి సత్యప్రభ' అని గురుదేవుల పేరు కలిసివచ్చేలా మాతాజీ పేరు నిర్ణయించడమూ జరిగిపోయాయి.

దుర్ముఖినామ సంవత్సర ఉగాది వచ్చింది. గత సంవత్సరం ఉగాదిని తలచుకొంటూ ఆశ్రమమంతా దుఃఖమగ్నమైంది ముందరిరోజు. అంతలోనే తేరుకొని పిల్లలందరు ఉదయం స్నానాలు, ప్రార్థన పూర్తయ్యాక వేపపూత కోసుకొని వచ్చారు. ఏటా గురువుగారి వెంట వెళ్ళి కోసుకున్నప్పటి అనుభవాలు తలబోసుకుంటూ పచ్చడి కలపడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అవన్నీ యాంత్రికంగా జరుగుతున్నాయే తప్ప ఎవరిలోనూ సహజోత్సాహం లేదు. అంతలో విజయవాడ నుండి ఝాన్సీ వచ్చింది. ఆశ్రమానికి 'సాయిధామం' అనే నామకరణం జరిగి, కార్యక్రమాలు ప్రారంభమై పాతికేళ్ళు గడిచాయి. ఆ మాట తెలిసిన కొద్దిమంది ఆప్తులు మెల్లమెల్లగా రాసాగారు. దాంతో కొంత ఉత్సాహం పుంజుకున్నాము. కానీ గురువుగారి ఫొటో పెట్టి, దాని ముందరే కూర్చొని ఎలాగో పచ్చడి కార్యక్రమం పూర్తి చేశాము. అప్పటికి ఎనిమిదైంది. కొండల్‌రెడ్డిగారు, పుష్ప, వి.ఎస్.శర్మగారు, శారద, చంద్రారెడ్డిగారు, బ్రహ్మారెడ్డి, తిరుపతమ్మ, శ్రీ రామమోహన రావుగారు, శ్రీమతి లలిత, శ్రీమతి సాయిమాల, ప్రేమ్‌చందర్‌గారు, లాయర్ పద్మ, పి.వి.శ్రీనివాసు, స్మిత, నాయర్‌గారు, తంగమణి, రఘుగారు, వారి శ్రీమతి విజయకుమారిగారు మొదలైనవారు బయటి నుండి రాగా





ఆశ్రమవాసులు, పిల్లలు అందరూ కలిసి జ్ఞానధామంలోని గురుదేవుల చెంతకు వెళ్ళి, వారి ఆశీస్సులు తీసుకుని నామసంకీర్తనం చేసుకుంటూ మెయిన్‌రోడ్డు మీదకు సాయిధామం 'ఆర్చి' దగ్గరకు చేరుకున్నారు.

పాతికేళ్లనాటి స్మృతులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గుండెలు, కళ్ళు కూడా చెమరిస్తున్నాయి. ఒక్కక్షణం కళ్లు మూసుకొని గురువుగారిని స్మరించుకున్నాను. మా అమ్మగారు పదేపదే చెప్తుండే సూక్తి ఒకటి గుర్తు చేసుకున్నాను. "ఏది తప్పదో దాన్ని ఆనందంతో అనుభవించడమే మంచిది" కన్నీళ్లు రెప్పలచాటునే దాచి, ఆర్చి (తోరణద్వారాని)కి మామిడి తోరణాలు కడుతున్న వారిని పైనున్న బాబాకు గురుదేవుల చిత్రపటానికి, నామ ఫలకానికి పూలదండలతో అలంకారం చేస్తున్న వారిని చూస్తూ ఉండిపోయాను. పసుపు కుంకుమలతో అలంకరించి, కొబ్బరికాయలు కొట్టి, హారతులిచ్చాము. మెల్లగా వెనుదిరిగి ఆశ్రమానికి చేరుకున్నాము.

సాధారణంగా పర్వదినాలలో సాయిసచ్చరిత్రగానీ, దత్త చరిత్రగానీ పారాయణ చేసే అలవాటు. కానీ ఈసారి "స్వామి తానై నడచి వచ్చిన సాయిధామం" పుస్తకం పారాయణ చెయ్యాలనీ, తద్వారా యీ పాతికేళ్ళ ప్రస్థానంలోని ముఖ్య ఘట్టాలను ఒక్కసారి తడిమి చూసుకోవాలనీ అనుకున్నాము. క్రితం రాత్రే ప్రారంభించి ఒక వంతు పూర్తి చేశాము. ఉగాదినాటి ఉదయం అల్పాహారం పూర్తయ్యాక మిగిలిన దానిలో కొంతభాగం చదువుకున్నాము మిత్రులందరం కలిసి. అంతలో మధ్యాహ్నం అయింది. నాయర్‌గారు, రఘుగారు కమ్మగా వండి వడ్డిస్తే పలురకాల పదార్థాలతో భోజనాలు ముగిశాయి. మెల్లమెల్లగా అతిథులు సెలవు తీసుకున్నారు. మిగిలిన వాళ్లం అందరం ఎప్పుడెప్పుడో జరిగిపోయిన అనుభవాలు ముచ్చటించుకుంటూ వాటిని ప్రసాదించిన గురుదేవుల గురించి మాట్లాడు కుంటూ సాయంత్రందాకా గడిపాము. తిరిగి ఆ రాత్రి సాయిధామం పుస్తకం చదివే ప్రయత్నంలో పడ్డాము. అలా రజతోత్సవంగా జరగాల్సిన రోజు కాస్తా కేవలం నామకార్థంగా జరుపుకోవలసి వచ్చింది.